ఇంటి దొంగలు..!

- పేదల పేరుతో పక్కాగృహాలు మంజూరు
- బిల్లులు కూడా స్వాహా
- లబ్ధిదారులకే తెలియని దుస్థితి
- సొంతింటికి నోచుకోక నిరుపేదల అవస్థలు



“ఈయన పేరు ఇడగొట్టు నారాయణప్ప. తన కల్లు మండలం చంద్రాయునిపల్లి వాసి. పెద్దలు కట్టించిన ఈ పాత ఇంట్లోనే నివాసం ఉంటున్నాడు. అది కూడా వర్షానికి తడుస్తుంటే, పైన ప్లాస్టిక్ పట్టలు వేసుకున్నాడు. నిరుపేద అయిన ఈయన ఇల్లు కట్టుకోవాలనుకున్నాడు. పక్కాగృహం మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులను కోరాడు. పరిశీలించిన అధికారులు.. 'ఇదివరకే నీ పేరుతో ఇల్లు మంజూరైందనీ, ఆన్‌లైన్‌లో పేరు ఉందనీ, బిల్లులు కూడా విడుదలయ్యాయ'ని చెప్పారు. దీంతో నారాయణప్ప షాక్ తిన్నాడు. తన పేరుమీద తనకే తెలియకుండా ఇల్లు ఎలా మంజూర చేస్తారనీ, బిల్లు ఎలా చెల్లిస్తారని నిలదీశాడు. తామేమీ చేయలేమని అధికారులు చెప్పడంతో నిరాశతో వెనుదిరిగాడు. ఇక, తనకు పక్కాగృహం మంజూరు కాదనీ, పాత ఇంట్లోనే కాలం వెల్లదీయాల్సి వస్తోందని వాపోతున్నాడు. పాత ఇల్లు కూలితే తమ పరిస్థితి ఏంటని ఆవేదన చెందుతున్నాడు. మండలంలో ఇలాంటి బాధితులు చాలామంది ఉన్నారు. పాలకులు, అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు.”

తనకల్లు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పక్కాగృహాల్లో అంతులేని అక్రమాలకు పాల్పడ్డారు. ఏకంగా నిరుపేదలైన లబ్ధిదారులకే తెలియకుండా ఇళ్లు మంజూరు చేసి, బిల్లులు కూడా స్వాహా చేశారు. దీంతో ఎంతోమంది నిరుపేదలు పక్కాగృహాలకు నోచుకోకుండా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం 1, 2, 3 దశల్లో విచ్చలవిడిగా పక్కాగృహాలు మంజూరు చేశారు. లబ్ధిదారులకు తెలియకుండానే వారి పేరుమీద పక్కాగృహాల మంజూరు చేసి, బిల్లుల కూడా చెల్లించారు. ఎవరికి చెల్లించారో అధికారులు కూడా చెప్పట్లేదు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు డిజిటలైజేషన్ (ఆన్‌లైన్) చేశాయి. దీంతో పక్కాగృహాలు మంజూరైనా, బిల్లులు తీసుకున్న అందరి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గత పాలకులు ఆఫ్‌లైన్‌లో ఇష్టమొచ్చినట్లు మహిళాసంఘాలను అడ్డం పెట్టుకుని బిల్లులు దోచేశారు. నేడు నిరుపేదలు పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకుంటే మండలవ్యాప్తంగా పరిశీలించిన అధికారులు వేల సంఖ్యలో లబ్ధిదారులకు తెలియకుండా బిల్లులు కాజేసినట్లు తెలుస్తోంది. తమ పేరుతో మంజూరైన పక్కాగృహాలకు తమకు తెలియకుండానే ఎవరు బిల్లులు తీసుకున్నారో కూడా తెలియక నిరుపేదలు లబోదిబోమంటున్నారు. ఓసారి పక్కాగృహం మంజూరై, బిల్లులు తీసుకున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదైతే అంతే సంగతులు. మళ్లీ (మిగతా 7లో...)



ఇడగొట్టు నారాయణప్ప నివాసం ఉంటున్న పాత మిద్దె

రేషన్ బియ్యం దందా..!

యథేచ్ఛగా అక్రమ రవాణా

- కర్ణాటక తదితర ప్రాంతాలకు తరలింపు
- ఏటా 3 వేల నుంచి 4 వేల క్వింటాళ్లు..
- విజిలెన్స్ దాడులు చేస్తున్నా.. ఆగని వైనం..

అనంతపురం క్రైం, జూలై13(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ 'రైస్' పుష్పరాజ్‌లు రెచ్చిపోతున్నా రు. అక్రమ మార్గాల్లో సబ్సిడీ బియ్యాన్ని రవాణా చేస్తున్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దులు దాటించేస్తున్నారు. ఏటా 3 వేల నుంచి 5 వేల క్వింటాళ్లు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం. విజిలెన్స్ దాడుల్లో దొరికిపోతున్నా.. దందా మాత్రం ఆగట్లేదు.

గతేడాది 2,745 క్వింటాళ్ల బియ్యం విజిలెన్స్ తనిఖీల్లో పట్టుబడితే.. ఈ ఏడాది మూణ్నెళ్లలోనే వెయ్యి క్వింటాళ్లకుపైగా సీజ్ చేశారు. ఈ లెక్కన చూస్తుంటే.. బియ్యం అక్రమ రవాణా ఏస్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.




విజిలెన్స్ కార్యాలయం

అధిక ధరల ఆశ చూపి..

ప్రభుత్వం పేదలకు రేషన్ షాపుల ద్వారా సబ్సిడీ బియ్యం అందిస్తోంది. పేదలు, సామాన్యులు మూడుపూటలా తిండికి ఇబ్బందులు పడకూడదన్న సదుద్దేశంతో పంపిణీ చేస్తోంది. బియ్యం స్మగ్లర్లు అధిక ధరలు ఇస్తామంటూ పేదలకు వల విసురుతున్నారు. కిలో రూ.12, రూ.15, రూ.18 అంటూ ఆశ చూపి, సామాన్యుల (మిగతా 7లో...)



బియ్యం అక్రమ రవాణా వాహనాన్ని పట్టుకున్న అధికారులు (ఫైల్)





ఇది కంపచెట్లతో నిండిన కీంకారణ్యం అనుకుంటే పొరబాటే. కంపచెట్ల పొదల మధ్యలో సన్నగా.. తీగలాగా.. కనిపిస్తోందే అది కాలువ. భూతద్దంతో చూస్తేగానీ కనిపించదు. గతేడాది వైసీపీ హయాంలో తీసిన ఫొటో.

భారీగా పెరిగిపోయిన చెట్ల పొదల మధ్య చిక్కి.. పలుచబడిపోయింది. అదేమీ చిన్నకాలువ కాదు. ఏకంగా దాదాపు 3వేల ఎకరాలకు సాగునీరు అందించే డిస్ట్రిబ్యూటరీ కాలువ. గార్లదిన్నె మండలంలోని మిడ్‌పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్) దక్షిణ కాలువ పరిధిలోని 8వ డిస్ట్రిబ్యూటరీ కాలువ. మర్తాడు వద్ద కనిపిస్తుంది. అంతటి కీలకమైన కాలువ చెట్ల మధ్యలో చిక్కిపోవడానికి గత వైసీపీ పాలకులే కారణం. రైతు ప్రభుత్వమని గొప్పలు చెబుతూనే అన్నదాతలు ఎంతో అవసరమైన కాలువపై నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఐదేళ్లలో ఏనాడూ మరమ్మతులు చేపట్టిన పాపాన పోలేదని రైతులు మండిపడుతున్నారు. దీంతో కాలువలో చెట్లు, పూడిక పెరిగిపోయి నీరు ముందుకు కదలని దుస్థితి దాపురించింది. వెరసి, చివరి ఆయకట్టుకు నీరు కూడా అందట్లేదని ఆయా రైతులు వాపోతున్నారు. పంటలు పండించుకోలేక ఆయకట్టును బీడు పెట్టుకున్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లు.. రైతుల.. వైసీపీ ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగారు. పదేపదే వినతిపత్రాలు ఇచ్చారు. కాలువ మరమ్మతులు చేయాలని వేడుకున్నారు. ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో అన్నదాతకు నిరాశే మిగిలింది. దక్షిణ కాలువ 11 డిస్ట్రిబ్యూటరీల పరిధిలో శింగనమల నియోజకవర్గంలో 35 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కాలువలకు మరమ్మతులు చేయక చాలా వరకు బీడు పెట్టుకున్నారు.

ఇదేదో కొత్తగా కాలువ తవ్వుతున్నారు అనుకుంటే పొరబాటే. గతేడాది చెట్ల పొదల మధ్య చిక్కిన ఎంపీఆర్ దక్షిణ కాలువ 8వ డిస్ట్రిబ్యూటరీనే ఇది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలి ఏడాదే రైతుకు అండగా పనులు చేపట్టింది. సాగునీటి సంఘాలను పునరుద్ధరించింది. దక్షిణ కాలువ పరిధిలోని 11 డిస్ట్రిబ్యూటరీల మరమ్మతులు పూర్తి చేసి, చివరి ఆయకట్టుకు నీరివ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆపరేషన్ మెయింటెనెన్స్ (ఓఎంఅండ్) కింద రూ.2.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. వెనువెంటనే కాలువల్లో కంపచెట్ల తొలగింపు, పూడికతీత పనులు చేపట్టారు. ఇప్పటికే 70 శాతం మేర పనులు పూర్తయ్యాయి. తుంగభద్ర, శ్రీశైలం డ్యాంలు నిండి గేట్లు తెరిచారు. హెచ్చెల్సీ, హంద్రీనీవాకు త్వరలోనే నీరు విడుదల చేయనున్నారు. ఈ లెక్కన ఈసారి ఎంపీఆర్‌కు పుష్కలంగా నీరు వచ్చే అవకాశం ఉంది. కాలువ మరమ్మతులు కూడా పూర్తవడంతో చివరి ఆయకట్టుకు కూడా నీరు చేరుతుందనీ, పంటలు పండించుకోగలమని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

-గార్లదిన్నె(ఆంధ్రజ్యోతి)



పూర్తయిన లైనింగ్ పనులు

తుది దశకు మరమ్మతులు

రేపటికి హెచ్చెల్సీ పనులు పూర్తి

కర్ణాటక వాటా నీటి విడుదలతో పెరుగుతున్న ఒత్తిడి

సరిహద్దులోకి చేరుతున్న జలాలు

రాయదుర్గం, జూలై 13(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువకాలువ మరమ్మతులు తుదిదశకు చేరుకున్నాయి. ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లో రూ. 35 కోట్లతో చేపట్టిన పనులు పూర్తి కానున్నాయి. కర్ణాటక తన వాటా నీటిని 10వ తేదీ నుంచి హెచ్చెల్సీకి విడుదల చేసుకుంది. దీంతో ఆంధ్ర వాటా నీటిని కూడా విడుదల చేసుకునేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. 15వ తేదీ నాటికి పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కాలువలో చేసిన పనులకు సంబంధించిన వృథా మట్టి, రాళ్లలాంటివి తొలగింపు ప్రక్రియ మాత్రమే మిగిలి ఉంటాయి. ఆంధ్ర సరిహద్దులో 105 కి.మీ. నుంచి హెచ్ఎల్ఎన్‌సీ పరిధిలో లైనింగ్, యూటీల నిర్మాణం, మట్టికట్టలు, హెడ్‌వాల్స్ బ్యాక్‌ఫిల్లింగ్, మెకానికల్‌కు సంబంధించిన పనులను చేస్తున్నారు. అధికారులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి రేయింబవళ్లు పనులు ముగింపుదశకు తీసుకురావడంలో సఫలీకృతులవుతున్నారు. తుంగభద్ర జలాశయంలో 80 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యాన్ని కుదించడంతో ఇప్పటికే జలాశయం నుంచి నదికి జలాలను వదులుతున్నారు. వృథాగా నదికి వెళుతున్న జలాల్లో సాధ్యమైనంత మేరకు హెచ్చెల్సీకి తీసుకునేందుకు అవకాశాలు ఉండేవి. కాలువల్లో నీటి ప్రవాహానికి ఎక్కడికక్కడ ఆటంకాలు, గండ్లు, పైపింగ్‌లు పడతాయని ఆందోళన ఉండేది. దీంతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులను మంజూరు చేయించారు. ఇప్పటికే ఆంధ్ర సరిహద్దుకు హెచ్చెల్సీ జలాలు చేరుతుండడంతో ఆంధ్రవాటా నీటిని సాధ్యమైనంత త్వరగా తీసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. 15వ తేదీ నాటికి క్యూరింగ్ పూర్తి చేసి కాలువలో ఉన్న మట్టి, వ్యర్థాల తొలగింపును రెండు, మూడురోజులల్లో ముగించుకుని నీటిని తీసుకోవాలనే ఆలోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. 20వ తేదీలోపు ఆంధ్రవాటా నీరు తీసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. కర్ణాటక తన వాటా నీటిని (మిగతా 7లో..)

సరిహద్దులో ఆగిన తుంగభద్ర జలాలు



బొమ్మనహాళ్ సరిహద్దులో గేట్లు దింపడంతో ఆగిన జలాలు

బొమ్మనహాళ్, జూలై 13(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి ఈ నెల 10న నీటిని హెచ్చెల్సీకి విడుదల చేశారు. శనివారం రాత్రికి బొమ్మనహాళ్ సరిహద్దులోని 105 కిలో మీటర్ వద్దకు చేరుకొన్నాయి. ఆంధ్రలోకి రాకుండా అధికారులు గేట్లు వేశారు. హెచ్చెల్సీకి మరమ్మతులు జరుగుతుండడంతో సరిహద్దులో గేట్లను దింపారు. ఈసారి తుంగభద్ర జలాశయానికి భారీగా వరద నీరు రావడంతో ముందస్తుగా హెచ్చెల్సీకి విడుదల చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక ఆయకట్టుకు మాత్రమే నీటిని విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఆంధ్రా వాటా ఈ నెల 15న విడుదల చేస్తామని అధికారులు అంటున్నారు. రైతులు ఇప్పటికే బోర్ల కింద వరి నారు పోసుకున్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

ఆపివున్న ఆటోను ఢీకొన్న బస్సు

ఒకరి మృతి... ఇద్దరికి గాయాలు..

7

పంచాయతీరాజ్ శాఖలో ఇష్టారాజ్యం

కిందిస్థాయి సిబ్బందికి వేధింపులు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఉన్నతాధికారులు



పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారులు మరింత ముందడుగు వేసి వారు చేయాల్సిన పనులు చేయకపోగా.. కింది స్థాయి సిబ్బందిని వేధిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధిత సిబ్బంది వాపోతున్నారు. దీంతో అలాంటి అధికారులు ఆడింది ఆట పాడింది పాటగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. కొందరు అధికారుల తీరుతో సిబ్బంది మానసికంగా నలిగిపోతున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ఒక మండలంలో పనిచేస్తున్న జేఈ ఎవరి మాటా లెక్కచేయడనే విమర్శలు ఉన్నాయి. కాంట్రాక్టర్లు, ఉన్నతాధికారులు ఆ జేఈతో ఏ పని చేయించుకోలేక సతమతమవుతున్నారు. 'నా మండలంలో జోక్యం చేసుకోవడానికి మీరెవరు' అంటూ ఆయన ఉన్నతాధికారులపైనే తిరుగుబాటు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక కింద స్థాయి సిబ్బంది పరిస్థితి అటు నుయ్యి.. ఇటు గొయ్యి అన్న చందంగా తయారయింది. పనిచేస్తే తన అనుమతి లేకుండా ఎలా చేస్తారని చివాట్లు పెడతాడు. చేయకపోతే ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్లతో ఒత్తిళ్లతో నలిగిపోతున్నారు. దీంతో ఆ మండలం (మిగతా 7లో..)

గేటుకు తాళం వేసి రీకౌన్సెలింగ్

పలువురు ఏఎన్ఎంల నిరసన

పర్యవేక్షించిన డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున రెడ్డి



గేటుకు తాళం వేసిన దృశ్యం

7

రైతుల సహనానికి పరీక్ష...!

దిష్టిబొమ్మల్లా భూసార పరీక్షా కేంద్రాలు

- నిధులు కేటాయించని గత వైసీపీ ప్రభుత్వం
- 'అనంత'కు పరుగులు తీస్తున్న రైతులు



ధర్మవరంలో మూతపడిన భూసార పరీక్షా కేంద్రం

ధర్మవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు చేయించుకోవాలంటే రైతులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పేరుకు కేంద్రాలు ఉన్నా నిరుపయోగంగా మారాయి. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేందుకు తగిన మోతాదులో రసాయనాలు వినియోగించేందుకు భూసార, నీటి పరీక్షలు ఎంతో ముఖ్యం. అలాంటి భూసార పరీక్షలను వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. భూసార పరీక్ష కేంద్రాలు మూతపడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. సత్యసాయి జిల్లాలో మూడు చోట్ల పరీక్షా కేంద్రాలు ఉండగా.. అందులో ఒక్కటి కూడా పనిచేయలేదు. పండ్ల మొక్కలు, ఇతర పంటలు సాగుచేసే సమయంలో భూసార, నీటి నమూనా పరీక్షలు ఎంతో కీలకం. ఇక్కడ పరీక్షా కేంద్రాలు మూతపడటంతో వ్యయప్రయాసాలకోర్చి అనంతపురం జిల్లాలోని ల్యాబ్‌కు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు వివిధ రకాల పంటలు సాగుచేస్తుంటారు. మట్టిసాంద్రత, నీటిలో లవణ శాతం తెలుసుకోవాలంటే పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. కదిరి, పెనుకొండ, ధర్మవరం డివిజన్ కేంద్రాల్లో ఉన్న భూసార పరీక్షా కేంద్రాలు మూతపడి ఉన్నాయి. దీంతో తాము పలు ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ఆర్బీకే కేంద్రాల ద్వారా నీరు, మట్టి పరీక్షలు రైతు పొలాల్లోనే చేసి వాటి వివరాలు తెలియజేస్తామని ఎంతో ఆర్భాటంగా అవగాహన కార్యక్రమాలు (మిగతా 7లో...)

రైతుల సహనానికి పరీక్ష..!

(5వ పేజీ తరువాయి)

కూడా నిర్వహించింది. ఏ ఒక్క రోజు కూడా నీటి, మట్టి పరీక్షలు చేసిన పాపాన పోలేదని రైతులు మండిపడుతున్నారు. వైసీపీ హయాంలో భూసార పరీక్షా కేంద్రాలకు నిధులు మంజూరు చేయకపోవడంతో అవి మూతపడ్డాయని ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. రైతులు తమ పొలాల్లోని మట్టి, నీటిని పరీక్షల కోసం అనంతపురంలోని భూసార నీటి పరీక్షా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. భూమిలో స్థూలపోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం, జింక్, ఐరన్ ఎంత నిష్పత్తిలో ఉన్నాయో తెలియక అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడుతుండటంతో సాగు చేసిన పంటలు పండక రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా భూసార పరీక్షా కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఐదేళ్లయినా పనిచేయని ల్యాబ్



వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ఆర్ అగ్రిల్యాబ్ ద్వారా భూసార, నీటి పరీక్షలు చేస్తామని అధికారులు తెలిపారు. ఐదేళ్లవుతున్నా కొత్తచెరువువ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో ఉన్న వైఎస్ఆర్ అగ్రిల్యాబ్ పరీక్షలకు నోచుకోలేదు. దీంతో మట్టి, నీటి పరీక్షల కోసం ఇబ్బంది పడుతున్నాం.

- కొనప్ప, రైతు, కొత్తచెరువు

అనంతపురం వెళ్లాల్సిందే



మా పొలాల్లో మట్టి, నీటి పరీక్షల కోసం అనంతపురం వెళ్లాల్సిందే. గతంలో ధర్మవరం వెళ్లేవాళ్లం. అక్కడ భూసార పరీక్షా కేంద్రం మూతపడటంతో వ్యయప్రయాసలకోర్చి అనంతపురం వెళ్లాల్సి వస్తోంది.

- జయచంద్ర, రైతు, ముదిగుబ్బ

పంచాయతీరాజ్ శాఖలో ఇష్టారాజ్యం

(5వ పేజీ తరువాయి)

అంటేనే పంచాయతీరాజ్ శాఖలో సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల బదిలీపై వచ్చిన అధికారులకు సహాయ నిరాకరణ చేస్తూ మొండికేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. వారికి తగిన ప్లేస్ రాకపోవడంతో ఇక్కడికి వచ్చిన వారికి చుక్కలు చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదంతా ఉన్నతాధికారుల ముందే జరుగుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో బాధిత సిబ్బంది తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఇన్‌చార్జ్ ఎస్‌ఈ ప్రభాకర్‌రెడ్డి వీటిపై దృష్టి సారించాలని సిబ్బంది కోరుతున్నారు.

పనులు లేని పీఏలు

ఉన్నతాధికారులకు సహాయకులుగా ఉండేందుకు నియమించిన పీఏలకు పనిలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులకు వచ్చే ఫైల్స్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి ఆ విభాగ అధిపతికి పంపేందుకు డీఈ స్థాయి అధికారులను పీఏలుగా నియమించుకున్నారు. పంచాయతీరాజ్ విభాగంలో ఏకంగా ముగ్గురు పీఏలుగా ఉన్నారు. పనులే లేనప్పుడు ముగ్గురు పీఏలు ఎందుకనే ఆ వర్గాల నుంచే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఉన్న ఎస్‌ఈ జహీర్ అస్లాం వీరిపై ఎన్నడూ ఆలోచించలేదు. ఈఈగా ఉన్నప్పుడు ప్రభాకర్‌రెడ్డి పలు సందర్భాల్లో ముగ్గురు పీఏలు ఇక్కడ అవసరమా? అన్న అనుమనాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం అయనే ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా కూడా ఉన్నారు. పీఏల పనితీరుపై నిఘా పెడతారన్న చర్చ జరిగింది. ప్రస్తుతం ఆయన కూడా పట్టించుకున్న పాపాన పోలేదన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే పలుచోట్ల ఇన్‌చార్జ్ డీఈలను నియమించారు. ఇలాంటి నేపథ్యంలో ముగ్గురు సీనియర్ డీఈలను ఎలాంటి పని లేని చోట నియమించడంపై పలు అనుమానాలకు దారి తీస్తోంది.

యువకుడిని కాపాడిన పోలీసులు

రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యాయత్నం

ఫోన్‌కాల్‌తో పోలీసులు అప్రమత్తం.. బంధువులకు అప్పగింత



ట్రాక్‌పై మహేష్

రొద్దం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహేష్ అనే యువకుడు రైల్వే పట్టాలపై పడుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. స్థానిక పోలీసులు ప్రాణాపాయం నుంచి కాపాడారు. రొద్దం ఎస్ఐ నరేంద్ర అందించిన సమాచారం మేరకు.. రొద్దం మండలం లోచర్ల గ్రామానికి చెందిన మహేష్ దొడ్డబళ్లాపురంలో పనిచేస్తూ కుటుంబ కలహాలతో శనివారం రాత్రి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. లోచర్ల గ్రామానికి చెందిన సచివాలయ మహిళా సంరక్షణ అధికారి కల్పనకు యువకుడు ఫోన్‌చేసి రైల్వే ట్రాక్‌పై పడుకుని ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. వెంటనే ఆమె ఎస్ఐకు సమాచారం అందించారు. అయన పెనుకొండ డీఎస్పీ నరసింగప్పకు సమస్యను వివరించారు. అప్రమత్తమైన డీఎస్పీ దొడ్డబళ్లాపురం పోలీసులకు సమాచారం అందించారు. ఫోన్ లొకేషన్ ఆధారంగా దొడ్డబళ్లాపురం పోలీసులు గ్రామ సమీపంలోని ట్రాక్‌పై పడుకుని ఉన్న యువకుడిని ప్రాణాపాయం నుంచి రక్షించారు. పోలీసులు యువకుడిని స్టేషన్‌కు తరలించి బంధువులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి అప్పజెప్పారు.

కొత్త కోర్సులకు అనుమతి

అనంతపురంరూరల్, జూలై13(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలకు కొత్త కోర్సులకు అనుమతి లభించింది. కళాశాలలోని సెల్ఫ్ ఫైనాన్స్‌కు రెండు కొత్త కోర్సులకు తాజాగా అనుమతులు వచ్చాయి. వీటిలో కంప్యూటర్ సైన్స్- డేటా సైన్స్(సీఎస్‌డీ), కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫీయల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ (సీఎస్‌ఎం) కోర్సులకు అనుమతులు వచ్చాయి. ప్రతి కోర్సుకు 60 సీట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే అందుబాటులో ఉన్న కంప్యూటర్ సైన్స్ (సీఎస్‌ఈ), ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) కోర్సులకు 60సీట్లు చొప్పున ఉన్నాయి. వీటిని 120 సీట్లకు పెంచారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర తెలిపారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి

అనంతపురం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని పలువురు మేధావులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో కవి ఉప్పరపాటి వెంకటేశులు, ఎద్దులపల్లి కుమార్, వాణిరాయుడు సంయుక్త అధ్యక్షతన 'ఆర్డీటి సేవలు - సామాజిక ఆవశ్యకత' అనే అంశంపై నిర్వహించిన చర్చా వేదికకు డాక్టర్ శాంతినారాయణ, వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డి, వాహబ్‌ఖాన్ ప్రధానవక్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆర్డీటి అనేక దశాబ్దాలుగా జిల్లాలో పేదల అభ్యున్నతికోసం కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వేలాది గ్రామాల్లో విద్య, ఆరోగ్య సేవలు అందించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించి ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిందని పేర్కొన్నారు. ఇలాంటి మహాసంస్థ సేవలను కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని, ఆ మేరకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిప్పేస్వామి, హనుమంతరాయుడు, డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

ఆపివున్న ఆటోను ఢీకొన్న బస్సు

ఒకరి మృతి... ఇద్దరికి గాయాలు..





ప్రమాదానికి కారణమైన బస్సు, దెబ్బతిన్న ఆటో



ఆటోడ్రైవర్ మహమ్మద్ హుస్సేన్(ఫైల్)

గార్లదిన్నె, జూలై 13(ఆంధ్రజ్యోతి): బస్సు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. మండలంలోని కల్లూరు సమీపాన 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఆటోడ్రైవర్ షేక్ మహమ్మద్ హుస్సేన్ (45) దుర్మరణం చెందగా.. ఇద్దరు చిరు వ్యాపారులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మహమ్మద్ హుస్సేన్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆదోనికే చెందిన ఉమాదేవి, మరియమ్మ తోపుడుబండ్లపై మొక్కజొన్న కంకులు అమ్ముకునేవారు. మొక్కజొన్న కంకులు తీసుకెళ్లేందుకు మరియమ్మ, ఉమాదేవి, ఖాజామొద్దీన్.. మహమ్మద్ హుస్సేన్ ఆటోను బాడుగకు తీసుకుని, శనివారం రాత్రి అనంతపురం వచ్చారు. మార్కెట్‌లో మొక్కజొన్న కంకులు కొనుగోలు చేసి, ఆటోలో వేసుకుని ఆదివారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమయ్యారు. కల్లూరు సమీపాన ఆటో టైరు పంక్చరైంది. మరియమ్మ, ఉమాదేవి ఆటోలోనే కూర్చోగా.. ఖాజామొద్దీన్ రోడ్డు పక్కన లైట్ వేస్తుడంగా.. మహమ్మద్ హుస్సేన్ టైరు మార్చుతుండేవాడు. బెంగళూరు నుంచి మంత్రాలయానికి వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు అతివేగంతో రావడంతో లైట్ వేస్తున్న ఖాజామొద్దీన్ పక్కకు పరుగెత్తాడు. ఆటోను బస్సు వేగంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మహమ్మద్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో పల్టీలు కొట్టింది. అందులో కూర్చున్న మరియమ్మ, ఉమాదేవి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, పరిశీలించారు. మరియమ్మ, ఉమాదేవిని 108 వాహనంలో అనంతపురం తరలించారు. మహమ్మద్ హుస్సేన్‌కు భార్య యాస్మీన్, నలుగురు పిల్లలు ఉన్నారు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్‌బాషా తెలిపారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ గంగాధర్ పరారయ్యాడు. బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించారు.

క్రికెట్ అభివృద్ధికి సమష్టి కృషి



సమావేశంలో పాల్గొన్న సీనియర్ క్రికెటర్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని సీనియర్ క్రికెట్ క్రీడాకారులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలోని ఆడిటోరియంలో జిల్లా క్రికెట్ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో క్రికెట్ క్రీడాభివృద్ధి, క్రీడాకారులకు ప్రోత్సాహకంపై చర్చించారు. ప్రతిభ గల క్రీడాకారులకు ఎంపికలో పారదర్శకత పాటించాలని నిర్ణయించారు. క్రికెట్‌కు, క్రీడాకారులకు ఆర్డీటీ అందిస్తున్న సహకారం, ప్రోత్సాహకానికి అభినందిస్తూ తీర్మానించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి, క్రీడాకారులు పగడాల మల్లికార్జున, షాబుద్దీన్, సురేష్, శ్రీనాథ్, మోహన్, చంద్ర, మచ్చా రామలింగారెడ్డి, శ్రీవాసు, ప్రసన్న, కమలాకర్ నాయుడు, వెంకటేష్, గులాం పాల్గొన్నారు.

ఆంధ్రా అండర్-19 ప్రాబబుల్స్‌లో

ఐదుగురికి చోటు



వీరారెడ్డి



జయంత్‌కృష్ణ



భువనేశ్వర్



రిహాన్



సాయిప్రతాప్ రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-19 క్రికెట్ జట్టు ప్రాబబుల్స్‌లో జిల్లాకు చెందిన ఐదుగురికి చోటు దక్కింది. వీరారెడ్డి, జయంత్‌కృష్ణ, భువనేశ్వర్, రిహాన్, సాయి ప్రతాప్‌రెడ్డి ఎంపికైనట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన వివిధ క్రికెట్ పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరచడంతో వీరికి అవకాశం దక్కిందన్నారు.

రేషన్ బియ్యం దందా..!

(5వ పేజీ తరువాయి)

నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. వాటిని ఒక చోట డంప్ చేసి... అక్రమంగా రవాణా చేస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల సరిహద్దు దాటించి కర్ణాటక ఇతర రాష్ట్రాలకు తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. డీ హీరేహాల్, రాయదుర్గం, చిలమత్తూరు, హిందూపురం ఇతర సరిహద్దు ప్రాంతాల నుంచి జిల్లా దాటిస్తున్నారు. ఇక్కడ కిలో సుమారు రూ.15లకు కొని, పక్క రాష్ట్రాల్లో రూ.22 నుంచి రూ.25 వరకు అమ్ముతున్నట్టు సమాచారం. జిల్లా నుంచి ఏటా 3 వేల నుంచి 5 వేల క్వింటాళ్ల వరకూ అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది.

క్వింటాళ్ల కొద్దీ బియ్యం స్వాధీనం...

విజిలెన్స్ దాడుల్లో భారీగానే అక్రమ రవాణాదారులు పట్టుబడుతున్నారు. ఈనెల 3న డి హిరేహాళ్ మండలం లింగమనహళ్లి గేటు సమీపంలో కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో ఉన్న వాహనంలో 43.60 క్వింటాళ్ల అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు దాడులు చేసి, పట్టుకున్నారు. ఈ అక్రమ రవాణాలో పాల్గొన్న డ్రైవర్లు, బియ్యం ఓనర్ ఇద్దరూ కర్ణాటకకు చెందిన వారే కావడం గమనార్హం. గతనెల 30వ తేదీ కూడా విజిలెన్స్ అధికారుల దాడుల్లో భారీగానే పట్టుబడ్డాయి. సుమారు 99 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ముఠాను అధికారులు పట్టేశారు. వ్యాన్‌లో తరలిస్తున్న బియ్యాన్ని అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి సమీపంలో 44వ జాతీయ రహదారిపై అధికారులు పట్టుకుని, సీజ్ చేశారు. 2024-25 ఏడాదిలో ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 25వతేదీ వరకూ ఏకంగా 121 కేసులు నమోదు చేశారు. అక్రమంగా రవాణా చేస్తున్న 2,745 క్వింటాళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ మాసాల్లోనే 39 కేసులు నమోదుచేశారు. 1,298 క్వింటాళ్ల స్వాధీనం చేసుకున్నారు.

అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు



రేషన్ బియ్యాన్ని విక్రయించినా, అక్రమంగా తరలించినా నేరం. అక్రమ రవాణాపై గట్టి నిఘా పెట్టాం. ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా సబ్సిడీ బియ్యాన్ని తరలిస్తే... కఠిన చర్యలు తీసుకుంటాం.

-వైబీపీటీఏ ప్రసాద్, ఏఎస్పీ, విజిలెన్స్

గేటుకు తాళం వేసి రీకౌన్సెలింగ్

పలువురు ఏఎన్‌ఎంల నిరసన

పర్యవేక్షించిన డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునరెడ్డి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ, పర్యవేక్షిస్తున్న డిప్యూటీ కలెక్టర్

అనంతపురం వైద్యం, జూలై 13(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయానికి తాళాలు వేసి.. ఆదివారం ఏఎన్‌ఎంలకు రీకౌన్సెలింగ్ నిర్వహించారు. ఐదేళ్ల ఒకేస్థానంలో విధులు నిర్వహించిన ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీ చేస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని సచివాలయ ఏఎన్‌ంలకు గత నెల 30న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి కౌన్సెలింగ్ నిర్వహించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు ఈ కౌన్సెలింగ్‌ను రద్దుచేసి రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని డీఎంహెచ్‌ఓకు ఆదేశాలు జారీచేశారు. దీంతో ఏఎన్‌ఎంలు ఆందోళన చేపట్టారు. ఆర్డర్లు ఇచ్చే సమయంలో ఇలా చేయడం ఏమిటని డీఎంహెచ్‌ఓ, కలెక్టర్ కార్యాలయాల ముందు నిరసనగళం విప్పారు. కోరుకున్న స్థానాలు దక్కనివారితో డీఎంహెచ్‌ఓ సిబ్బంది ముడుపులు తీసుకుని రీకౌన్సెలింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ వినోద్‌కుమార్ ఏఎన్‌ఎంల బదిలీల ఫైల్‌ను తెప్పించుకుని డీఎంహెచ్‌ఓ, ఏఓ, సిబ్బందిని తనవద్ద కూర్చుబెట్టుకుని కసరత్తు చేశారు. తమకు అన్యాయం జరుగుతోందని కొందరు ఏఎన్‌ఎంలు ఆదివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించిన రీకౌన్సిలింగ్‌ను అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో కార్యాలయ ప్రధాన గేట్‌కు తాళంవేసి డీఎంహెచ్‌ఓ చాంబర్‌లో బదిలీల ప్రక్రియ నిర్వహించారు.

తాళంవేసి..

వైద్య, ఆరోగ్య శాఖలో కౌన్సెలింగ్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన బదిలీల ప్రక్రియ సందర్భంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి తాళంవేశారు. అధికారులు, సిబ్బంది ఫోన్‌లను స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి ఆన్‌లైన్‌ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించగా డిప్యూటీ కలెక్టర్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి పర్యవేక్షించారు. 792 మంది ఏఎన్‌ఎంలకు అర్థరాత్రివరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కాగా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ సోమవారం వస్తాయా? ఇంకా ఆలస్యం అవుతుందా? మళ్లీ ఏమైనా జరుగుతుందా? అని కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఏఎన్‌ఎంలు సందేహాలను వ్యక్తం చేశారు. ఏఓ గిరిజా మనోహర్ రావు, సిబ్బంది కమలాకర్‌రాజు, అశోక్, రాజేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

తుది దశకు మరమ్మతులు



లైనింగ్‌కు క్యూరింగ్

(5వ పేజీ తరువాయి)

సింగిల్ ఇండెంట్‌గా తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదని అధికారుల ద్వారా తెలుస్తోంది. 500 క్యూసెక్కులలోపే తన వాటా నీటిని తీసుకుంటోంది. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించి రెండు వాటాల నీరు ఒకేసారి తీసుకుంటే నీటి ప్రవాహం నష్టాలు ఇరు రాష్ట్రాల ఖాతాల్లో ఉంటాయి. ప్రస్తుతం కర్ణాటక సింగిల్ ఇండెంట్ కారణంగా ప్రవాహ నష్టాన్ని ఒంటరిగా భరించే పరిస్థితి నెలకొంది. దీంతో ఆంధ్ర వాటా జలాలు విడుదలయ్యే వరకు పరిపూర్ణంగా కర్ణాటక తన వాటాను తీసుకునే పరిస్థితిలో లేదు. అదే విధంగా జిల్లాకు తాగునీటి అవసరాల కోసం 10 టీఎంసీల మేరకు కేటాయించుకోవాల్సి ఉండడంతో తొలి ప్రాధాన్యంగా తాగునీటి కోసం పీఏబీఆర్, ఎంపీఆర్‌లకు మళ్లించి సాగుకు కేటాయించిన 8.36 టీఎంసీల నీటిని నిదానంగా విడుదల చేసుకునే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ ఏడాది 18.36 టీఎంసీల మేరకు హెచ్చెల్సీ వాటా నిర్ణయించడంతో ఆ మేరకు అధికారులు నీటి వినియోగాన్ని నిర్ణయించుకున్నారు. అధికారులు కాంట్రాక్టర్లపై నెలరోజుల నుంచి తీవ్ర ఒత్తిడి తెచ్చి అనుకున్న సమయానికి పనులను ముగించే పరిస్థితికి తీసుకొచ్చారు.

ఇంటి దొంగలు.!

(5వ పేజీ తరువాయి)

మంజూరయ్యే అవకాశం ఉండదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం మండలవ్యాప్తంగా 3,650 మంది పక్కాగృహాల కోసం అధికారులకు వినతులు అందించారు. వీటిని పరిశీలిస్తే వీటిలో మరింతమంది పేర్లు ఆన్‌లైన్‌లో కనిపించే అవకాశాలున్నాయని ఆ శాఖాధికారులు అంటున్నారు. పక్కాగృహం గత ప్రభుత్వంలో తీసుకున్నావని చెప్పగానే (వారికి తెలియకుండా) బిల్లులు మంజూరు కావడంతో వారు పెడుతున్న శాపనార్థాలు అన్నీఇన్నీకావు. ఎంతోమంది లబ్ధిదారులు తమకు తెలియకుండానే తమ బిల్లులు కాజేశారనీ, అప్పట్లో మహిళాసంఘాల మీద పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు కూడా చేశారు. గతంలో అధికారం చేపట్టిన వైసీపీ నాయకులు.. పోలీసు స్టేషన్‌లో దప్పటి పంచాయితీలు చేసి, రాజీ కుదిర్చారన్న ఆరోపణలున్నాయి. దీంతో ఆ నిరుపేదలు నేడు పక్కాగృహాలకు నోచుకోలేక పడుతున్న బాధలు వర్ణనాతీతం. అధికారులు, ప్రజాప్రతినిధులు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

నా పేరుతో పక్కాగృహం మంజూరైందంట



మేం పెద్దలు కట్టించిన పాత ఇంట్లో నివాసం ఉంటున్నాం. పక్కాగృహం కోసం దరఖాస్తు చేస్తే, గతంలోనే మంజూరై, బిల్లులు కూడా తీసుకున్నారని అధికారులు అంటున్నారు. మేం ఇల్లు కట్టుకోలేదు, బిల్లులూ తీసుకోలేదు. నా పేరుమీద ఎవరు బిల్లులు తీసుకున్నారో తెలియదు. ఆన్‌లైన్‌లో పేరు ఉండడంతో పక్కాగృహాలకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నా. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించి, నిరుపేదలైన మాకు పక్కాగృహాలు మంజూరు చేయాలి.

-శ్యామలమ్మ, వడ్డిపల్లి, తనకల్లు మండలం

ఆన్‌లైన్‌లో పేరుంటే ఏమీ చేయలేం

ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం కింద 1, 2, 3 దశల్లో పక్కాగృహాలు మంజూరైనా బిల్లులు పొందిన అందరూ ఆన్‌లైన్ ఉన్నారు. ఆన్‌లైన్‌లో పేరుంటే వారికి పక్కాగృహాల కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేయలేం. మండలవ్యాప్తంగా 3,600 దరఖాస్తులు అందాయి. వీటిపై విచారిస్తాం.

-విజయభాస్కర్, గృహనిర్మాణ శాఖ ఏఈ, తనకల్లు

కొలిక్కి వచ్చిన టీచర్ల క్యాడర్ సమస్య

అనంతపురం విద్య, జూలై 13 (ఆంధ్రజ్యోతి): టీచర్ల జిల్లా క్యాడర్ స్ట్రెంత్ సమస్య ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. గతనెలలో ప్రభుత్వం టీచర్ల బదిలీలు చేపట్టింది ఆ సమయంలో రేషనలైజేషన్‌లో అనేక పోస్టులు పోయాయి. కొత్త పోస్టులు ఇవ్వడంతో అనేకమంది స్కూల్ అసిస్టెంట్లు మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలుగా వెళ్లారు. మరికొన్ని స్కూళ్లను గ్రేడ్‌లు మార్చారు. కొందరు టీచర్లకు పదోన్నతులు కల్పించారు. జిల్లా విద్యాశాఖ లెక్కల ప్రకారం అన్ని క్యాడర్లు కలిపి 7,152 మంది టీచర్లు బదిలీ అయ్యారు. అన్ని క్యాడర్లు కలిపి 584 మందికి పదోన్నతులు కల్పించారు. కొత్త పోస్టులకు క్యాడర్‌స్ట్రెంత్‌కు ఖచ్చితంగా లెక్కలు చూపిస్తేనే ఆర్థికశాఖ నుంచి ఆమోదం పొంది వేతనాలు విడుదలవుతాయి. ఈ లెక్కలు చూపించడంలో ఆలస్యమవుతుండడంతో ఈనెల వేతనాలు చాలామంది టీచర్లు అందుకోలేకపోయారు. దీనిపై విద్యాశాఖ కమిషనర్ సీరియస్ కావడంతో జిల్లా ఐటీసెల్‌కు చెందిన ఏఎస్‌ఓ శ్రీనివాసులు. ఏపీఓ మంజునాథ్, మాజీ ఏఎస్‌ఓ, ఎంఈఓ జయచంద్రనాయుడు, మారుతీ మంగళగిరిలోని విద్యాశాఖ కమిషనరేట్‌కు వెళ్లారు. రెండురోజులుగా అక్కడే ఉంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న క్యాడర్ స్ట్రెంత్‌ను పరిగణలోకి తీసుకొని ఇటీవల జరిగిన బదిలీలకు అనుగుణంగా లెక్కలు తేల్చి కొలిక్కి తెచ్చారు. సోమవారం కమిషనర్‌కు అప్పగిస్తామని ఏఎస్‌ఓ తెలిపారు. ఈనెల 20వతేదీలోగా వేతనాలు అందని టీచర్లకు మంజూరు చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. దీంతో ఇటు విద్యాశాఖ అధికారులు, అటు టీచర్లు ఊపిరిపీల్చుకుంటున్నారు.

గుత్తిలో రెండు చోట్ల చోరీ

గుత్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెండు చోట్ల శనివారం రాత్రి చోరీ జరిగింది. వ్యవసాయ పొలంలో మోటర్, ఎలక్ట్రికల్ సామాగ్రి చోరీ చేశారు. అదే విధంగా ఓ మెకానిక్ షాపులో రూ.25వేలు విలువ చేసే సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతపురం రోడ్డులో ఓ వ్యవసాయ పొలంలో బోరులోని మోటరు, పైపులు, వైర్లను, కంటైనర్లకు ఉన్న తాళాలను పగలగొట్టి అందులో ఎలక్ట్రికల్ సామాగ్రిని చోరీ చేసినట్లు బాధితుడు మాకం రంగనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాదాపు రూ. 90వేలు విలువ చేసే సామగ్రి చోరీ అయ్యిందని బాధితుడు వాపోయాడు. అదే విధంగా ఆటో మెకానిక్ షాపులో షాపు తాళాలను పగలగొట్టి అందులో ఉన్న రూ.25వేల విలువ చేసే సామగ్రిని గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారని బాధితుడు సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాసనం గుర్తింపు



అచ్యుతరాయల శాసనాన్ని చూపుతున్న మైనాస్వామి

పెనుకొండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బసవన్నబావి వద్ద 1532 నాటి అచ్యుతరాయల శాసనాన్ని గుర్తించినట్లు ప్రముఖ చరిత్రకారుడు మైనాస్వామి పేర్కొన్నారు. ఆదివారం బుక్కపట్నానికి చెందిన పరిశోధకుడు గోపి, శ్రీధర్‌స్వామితో కలిసి పట్టణంలోని విజయనగర సామ్రాజ్యంనాటి కట్టడాలు, శిల్పసంపదపై పరిశోధనలో భాగంగా శివాలయం వద్ద ఉన్న ఉత్సవ మండపాన్ని, బసవన్న బావిని ఆయన పరిశీలించారు. బసవన్న బావి ముందు కనిపించిన ఓ శాసనాన్ని పరిశీలించారు. కన్నడంలో రాసిన ఆ శాసనంలో ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. విజయనగర సామ్రాజ్యాన్ని అచ్యుతరాయలు పరిపాలిస్తున్న కాలంలో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఒక మెట్లబావిని, ఉత్సవ మండపాన్ని నిర్మించారు. బావి ముందున్న ఓ రాతిపలకపై గల శాసనంపై 'నమస్తుంగ శిరస్సుంబి శిరుస్సుంబి చంద్రచామర చారవే త్రైలోక్య నగరాంభ మూలస్తంభాయ శంభవే' అని శివస్తుతితో మొదలవుతుంది. శాలివాహన శకవర్షం 1454 వైశాఖ శుద్ధ 15నాడు అనగా సామాన్యశకం 1532 ఏప్రిల్‌లో శివాలయం కోసం ఒక మెట్లబావిని తవ్వించినట్లు శాసనం వివరిస్తుందని మైనాస్వామి పేర్కొన్నారు. ఒకప్పుడు ఎంతో సుందరంగా ఉన్న మెట్లబావి ప్రస్తుతం చెత్తాచెదారంతో నిండిపోయిందన్నారు. బావిలో ఎడమవైపు 'శ్రీ త్రయంబక శరణో' అనే ఏకవాక్య కన్నడశాసనాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఆ శాసనం వద్ద విజయనగర సామ్రాజ్య చిహ్నామైన సూర్యచంద్రులు, కత్తి, శివలింగం చెక్కబడి ఉన్నాయన్నారు. భారత పురావస్తుశాఖ అధికారులు చొరవ తీసుకుని బావి మరమ్మతులు, శాసనం రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల పాలు

● సుపరిపాలనలో తొలి అడుగులో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, జూలై 13(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ విమర్శించారు. మండలంలోని నాయనవారిపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఆమె సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షే మం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. అలాగే కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఏ శాఖలో చూసినా ఒక్క పైసా కూడా మిగల్చకుండా అప్పటి పాలకులు దోచేశారని మండిపడ్డారు. అభివృద్ధి చేయకున్నా.. అప్పులు మాత్రం బాగానే చేశారని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు ఆర్థిక కష్టాలున్నా.. లెక్కచేయక ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని తెలిపారు. ఇప్పటికే చాలావరకు అమలు చేశారని, మిగతావాటిని కూడా త్వరలోనే అమలు చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, సిగింల్ విండో అధ్యక్షుడు గుర్రం లక్ష్మీనారాయణ, నాయకులు డేగల కృష్ణమూర్తి, మారుతీనాయుడు, శాలిని, లక్ష్మీదేవమ్మ, మాసూల చంద్ర, బోయసత్తి, నాగమునితోపాటు పెద్దఎత్తున కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న బండారు శ్రావణిశ్రీ

అన్న క్యాంటీన్లను మూసేసిన ఘనత వైసీపీదే

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను మూసేసిన ఘనత వైసీపీదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మండలంలోని రాజీవ్‌కాలనీలో సుపరిపాలనతో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అన్న క్యాంటీన్లు తమలాంటి పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పలువురు కూలీలు తెలపగా.. ఎమ్మెల్యే స్పందిస్తూ.. వైసీపీ పాలనలో వాటిని మూసివేయించి పేదల కడుపు కొట్టారని మండిపడ్డారు. చంద్రబాబు సీఎం అవగానే మళ్లీ పునఃప్రారంభించారని తెలిపారు. పేదల సంక్షేమం కోసమే ఈ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. వైసీపీ పాలనలో రాజీవ్ కాలనీని పూర్తిగా విస్మరించారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇక్కడ విద్యుత్ సమస్యను పరిష్కరించామన్నారు. త్వరలోనే డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. గుత్తి రోడ్డు నుంచి రాజీవ్ కాలనీకి లింక్ రోడ్డు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, జిల్లా ఉపాధ్యక్షుడు డిష్‌నాగరాజు, అధికార ప్రతినిధి సరిపూటిరమణ, బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుమ చౌడయ్య, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, కార్పొరేటర్ బాలాంజనేయులు, నాయకులు డాక్టర్ హరి, లింగమయ్య, సాధిక్, మాబు, శోభ, బల్లా పల్లవి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

బసవతారక నగర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు


కురుగుంటలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ శ్రేణులు

అనంతపురంరూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపేట పంచాయతీ బసవతారక నగర్‌లో ఆదివారం టీడీపీ శ్రేణులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఇంటికీ వెళ్లి ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే కరపత్రాలు పంచారు. టీఎన్‌టీయూసీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు తాడాలనాగభూషణం, రాప్తాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ సాలమ్మ, మండల సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు రత్నమోహన్, డీలర్లు బాబావలి, సాంబశివ, విష్ణు, శివ తదితరులు పాల్గొన్నారు. అలాగే కురుగుంట గ్రామంలోనూ .టీడీపీ నాయకులు, కార్యకర్తలు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక సమీపంలో గల గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు రామాచార్యులు వేకువజామునే స్వామివారి మూల విరాట్‌కు పలు అభిషేకాలు చేసి, వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


ప్రత్యేకాలంకరణలో గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరుడు

గొందిరెడ్డిపల్లిలో సీపీఐ మహాసభ

రాప్తాడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందిరెడ్డిపల్లి గ్రామంలో సీపీఐ మండల కార్యదర్శి రవీంద్ర ఆదివారం మహాసభ నిర్వహించారు. వర్షాలు సక్రమంగా కురవక రైతులు కరువుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఆర్థిక సహాయం చెయ్యకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. అనంతరం సీపీఐ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ

అనంతపురంరూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం పంచాయతీ నాగిరెడ్డి పల్లికి చెందిన టీడీపీ నాయకుడు ఆదినారాయణ తల్లి ఆదెమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాల్సిందే: సీపీఎం


ట్రూ అప్ చార్జీల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును, ట్రూ అప్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ ప్రజల వ్యతిరేకతను ప్రభుత్వానికి చాటిచెప్పేందుకు సీపీఎం నాయకులు క్యూ ఆర్ కోడ్ పత్రాలను ఆదివారం నగరంలోని వివిధ కాలనీల్లో ఇంటింటికీ తిరిగి పంచారు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు నష్టం కలిగించే సెకీ ఒప్పందాలను ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భారాలపై ప్రభుత్వానికి అర్జీలు పెట్టాలని కోరారు. అధికారంలోకి రాక ముందు నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి, విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, నేడు అధికారంలోకి వచ్చాక హామీని విస్మరించి స్మార్ట్ మీటర్ల బిగింపును రాష్ట్రంలో అమలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఇర్ఫాన్, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మీ, నారాయణ, నాగేంద్ర, బుల్లె రాజు, మోహన్, వెంకటేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఒకరోజు శిక్షణ

అనంతపురం రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏపీపీ విజిలెంట్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంలో ఆదివారం జావా ఫుల్ స్టాక్ వెబ్ డెవలప్‌మెంట్‌పై ఒకరోజు శిక్షణ జరిగింది. ఇందులో విద్యార్థులకు టెక్నాలజీపై , ప్రాక్టికల్స్‌పై అవగాహన కల్పించారు. అలాగే హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, స్ప్రింగ్ బూట్, డాటా జేఏపీలపై వివరించారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేసిన సంస్థ సభ్యులు

గుత్తి రామకృష్ణ సేవలు చిరస్మరణీయం

అనంతపురం టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు, సీనియర్ పాత్రికేయుడు గుత్తి రామకృష్ణ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. గుత్తి రామకృష్ణ 110వ జయంతిని పురస్కరించుకుని తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కృష్ణకళామందిర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుత్తి రామకృష్ణ తనయుడు గుత్తి ఆనందవర్ధన్, మురళీకృష్ణ, రచయిత గిరిధరప్రసాద్‌రాయ్, కృష్ణమూర్తి.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, తొలితరం కథకుడు, జర్నలిస్టుగా గుత్తి రామకృష్ణ విశేషమైన సేవలందించారని గుర్తు చేసుకున్నారు. స్వాతంత్ర్యోద్యమంలో జైలుశిక్ష అనుభవించి, పోలీసుల కాల్పుల్లో ఒక కన్ను కోల్పోయిన ధీరుడు రామకృష్ణ అని కొనియాడారు. ఆనాటి రాయలసీమ కరువు పరిస్థితులను కథల రూపంలో బయటి ప్రపంచానికి తెలియజేసిన తొలి కథకుడుగా పేరొందారన్నారు.

గుత్తి రామకృష్ణ స్మారక కమిటీ ఏర్పాటు...

గుత్తి రామకృష్ణ 110వ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ స్మారక కమిటీని సాహితీవేత్తలు ప్రకటించారు. స్మారక కమిటీ గౌరవాధ్యక్షుడిగా గుత్తి ఆనందవర్ధన్, కన్వీనర్‌గా నాగరాజుతో తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి, సింగరాయని శ్రీనివాసులు, కేపీ రాజు, చెట్ల ఈరన్న, అల్తాఫ్, మనోహర్ పాల్గొన్నారు.


గుత్తి రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీకారులు

జలధికి తరలిన పీర్లు

అనంతపురం రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని మన్నీల గ్రామంలో ఆదివారం పీర్లు జలధికి వెళ్లాయి. ఉదయమే ముజావర్లు పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అనంతరం మఖానంలో ఉంచగా.. గ్రామస్థులు, చుట్టుపక్కల ప్రాంతాల వారు పెద్దఎత్తున చక్కెర చదివింపులు చేయించి ప్రార్థనలు జరిపారు. సాయంత్రం పీర్లను గ్రామంలో ఊరేగింపు చేసి జలధికి తరలించారు. పిల్లలు పెద్దలు అలావ్ తొక్కుతూ సందడి చేశారు.

● రామగిరి : మండలంలోని పోలేపల్లి గ్రామంలో ఆదివారం పీర్లు జలధికి తరిలాయి. గ్రామస్థులు శనివారం రాత్రి పానకాలు మోసి మకానం వద్ద చక్కెర చదివింపులు చేయించారు. తర్వాత ముజావర్లు ఆదివారం తెల్లవారుజామున పీర్లను గ్రామంలో ఊరేగించి అగ్నిగుండ ప్రవేశం చేయించారు. సాయంత్రం అలావ్ తొక్కుతూ పీర్లను జలధికి తరలించారు.


మన్నీలలో జలధికి వెళ్తున్న పీర్లు


పోలేపల్లిలోని పీర్ల ఊరేగింపులో గ్రామస్థుల సందడి

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేదిలేదు


నిరవధిక సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేదిలేదని సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, గౌరవాధ్యక్షుడు గోపాల్ పేర్కొన్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి దిగిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో దిగినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదయినా 13వేల మందికి పైగా ఉన్న ఇంజనీరింగ్ కార్మికులు సమస్యలు పరిష్కారం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 16న చలో విజయవాడ చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సంజీవరాయుడు, నాయకులు ఓబులపతి, మురళీ, పోతులయ్య, శివన్న, సుబ్బిరెడ్డి, రవికిరణ్, సలీం, దాదూ, రమేష్, గంగిరెడ్డి, మధు, సుధాకర్, వన్నప్ప, లక్ష్మి పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్‌ను వినియోగించుకోండి

రాప్తాడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ సోలార్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ శివకుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇంటి పైభాగంలో సోలార్ ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందన్నారు. ఈ పథకంపై రాప్తాడు, గంగలకుంట గ్రామాల్లో సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు.

వీకే పార్వతమ్మ మృతి..


భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం విద్య, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర సమరయోధుడు దివంగత వీకే ఆదినారాయణరెడ్డి సతీమణి వీకే పార్వతమ్మ(100) కన్నుమూశారు. జిల్లా కేంద్రంలోని స్వగృహంలో ఆదివారం ఆమె పరమపదించారు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయిజిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, నాయకులు మల్లికార్జున, నారాయణస్వా మి, శ్రీరాములు, లింగమయ్య, కేశవరెడ్డి, కత్తి నారాయణస్వామి, రమణ, కృష్ణుడు, ఎల్లుట్ల నారాయణస్వామి, చిత్రచేడు రామాంజనేయులు, శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ కుళ్లాయిస్వామి, బీకేఎస్‌స్వామి, సుందరరాజు,భాగ్యలక్ష్మితో పాటు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

● అనంతపురం టౌన్: వీకే పార్వతమ్మ మృతి పట్ల సీపీఎం సంతాపం వ్యక్తం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ ప్రకటనలో వెల్లడించారు. జీవితమంతా కమ్యూనిస్టు ఉద్యమానికి చేదోడుగా నిలిచిన పార్వతమ్మ ధన్యురాలని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలను తన పిల్లలుగా భావించి ఆదరించేవారన్నారు. సీపీఎం ప్రచురించిన జిల్లా కమ్యూనిస్టు యోధుల పుస్తకావిష్కరణ సభలో పార్వతమ్మ పాల్గొని నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని తెలిపారు. కరోనా సమయంలోనూ సీపీఎం అందించిన సేవలను ఆమె ప్రశంసించి ప్రోత్సహించేవారని గుర్తు చేసుకున్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.37 లక్షలు

అనంతపురంరూరల్, జూలై13(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశులసంతతో మార్కెట్‌కు రూ.3,37,790 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,93,390, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,44,400 చొప్పున ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

ఆ రోడ్డుపై ప్రయాణం.. నరకం

● గుంతలమయంగా అశోక్‌నగర్-కలెక్టరేట్ ప్రధాన రహదారి
● ప్రయాణించాలంటే ఇబ్బంది పడుతున్న వాహనదారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ప్రయాణించాలంటే నరకం కనపడుతోందని వాహనదారులు వాపోతున్నారు. నిత్యం ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు తీవ్ర గుంతలమయంగా మారింది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు సైతం కలెక్టరేట్‌కు ఈ రోడ్డు గుండానే వెళుతుంటారు. మోకాల్లోతు గుంతలు పడినా.. అధికారులకు ఎవరికీ కనిపించడం లేదు. ముఖ్యంగా అశోక్‌నగర్ మెయిన్ రోడ్డు అంబేడ్కర్‌భవన్ ముందు గుంతలు పెద్దఎత్తున ఉన్నాయి. ప్రతి నిత్యం నగరపాలక సంస్థ అధికారులు ఇదే రోడ్డుమీదుగా కలెక్టరేట్‌తోపాటు హౌసింగ్‌బోర్డు, శారదానగర్, బుడ్డప్పనగర్, జేఎన్‌టీయూ వరకు వెళ్తుంటారు. అయినా ఆ గుంతలు మాత్రం ఎవరికీ కనిపించడం లేదా అని అటుగా వెళ్లే నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. చిన్న చినుకుపడినా గుంతలు నీటితో నిండిపోయి రోడ్డంగా చిత్తడిగా మారుతోంది. ఈ క్రమంలో రాకపోకలు సాగించాలంటే తీవ్ర అసౌకర్యంగా ఉంటోందని, నరకం కనపడుతోందని, ఇప్పటికైనా ఈ రోడ్డు బాగు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.



అంబేడ్కర్ భవన్ ఎదుట గుంతలమయంగా మారిన రహదారి

నాట్యానందమాయె

● ఉట్టిపడిన వివిధ రాష్ట్రాల నాట్యసంస్కృతి
● భారతీయ కళలకు అవధుల్లేవు : ఎంపీ అంబికా


మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతులకు చెందిన నాట్య ప్రదర్శనలను ఒకే వేదికపై తిలకించి అనంతవాసులు పులకించిపోయారు. శ్రీనృత్య కళానిలయం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణమండపంలో నిర్వహించిన 'సంధ్యా రవళి' జాతీయస్థాయి నృత్యోత్సవంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి నాట్య కళాకారులు దాదాపు 250 మందికి పైగా పాల్గొని తమ నాట్యప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమానికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మాజీ మేయర్ మదమంచి స్వరూప ముఖ్యఅతిథులుగా హాజరై గణనాథుడికి పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా నాట్య విద్యను బోధిస్తూ వేలాదిమంది నాట్యకళాకారులు, గురువులను సైతం తయారు చేయడం అభినందనీయం అన్నారు. ప్రతియేటా సంధ్యారవళి నిర్వహిస్తూ ఎంతో మంది కళాకారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. అనంతరం కళాకారులు భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలిచ్చారు. నాట్యగురువులకు నర్తనాచార్య, నాట్య కళాకారులకు నర్తనబాల పురస్కారాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, శ్రీనిధి రఘు, లంకా ప్రసాద్, రమేష్‌నీల్, మహాలక్ష్మి నాగరాజు, శ్రద్ధ, హారిక, దివ్యశ్రీ, కావ్య, జీఎస్ నగేష్, అనిల్‌కుమార్, కత్తి విజయ్‌కుమార్, హరిప్రసాద్, రాధికా విహారి, పరిణీత సాయి, నాగసాయి హిమజ పాల్గొన్నారు.




నాట్యం చేస్తున్న కళాకారులు

రజకుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదుగుదలకు నోచుకోని రజకుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని రజక సంఘం నాయకులు తెలిపారు. స్థానిక గుత్తి రోడ్డులో గల దోబీఘాట్ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం రజక విద్యావంతులు-మేధావుల సమావేశం జరిగింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తం గా రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా చర్చించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ.. రజకులకు విద్య, వైద్యం ఉచితంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో, తిరుపతి, శ్రీశైలం వంటి ప్రధాన ఆలయాల్లో దోబీకి సంబంధించిన టెండర్లు రజకులకే ఇవ్వాలన్నారు. రజకులు చదువులో, రాజకీయ, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. రజకుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్‌సీ పరమేశ్వర్, రజకవృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి లింగమయ్య, ఆర్టీసీ విశ్రాంత అధికారి వెంకట రమణ, రజక సంఘం నాయకులు వెంకటేష్, శ్రీనివాసులు, శ్రీశైలం చంద్రకుమార్, రామకృష్ణ, మల్లేష్, శ్రీరాములు, నవనందిని శ్రీనివాసులు, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ అమ్మపేరుతో మొక్కలు నాటి సంరక్షించాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. ప్రకృతి సేవకురాలు, కేంద్రీయ విద్యాలయంలో మూడో తరగతి చదువుతున్న నవనితో కలిసి ఆదివారం ఆమె స్థానిక జెడ్పీ కార్యాలయ ఆవరణంలో మొక్క నాటారు. అ నంతరం మాట్లాడుతూ.. గ్రీన్ అనంత, గ్రీన్ ఆంధ్రా, గ్రీన్ ఇండియా, స్వర్ణాంధ్ర కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలని కోరారు. చిన్నవయసులోనే పర్యావరణ పరిరక్షణపై మక్కువ పెంచుకుని నవని స్ఫూర్తిదాయకంగా నిలిచిందని, ఇది ఎంతో సంతోషకరమని ఆ బాలికను అభినందించారు.


నవనితో కలిసి మొక్క నాటుతున్న జడ్పీ చైర్‌పర్సన్

న్యూస్ బాక్స్

అమ్మవారికి ఆషాఢం బోనాలు



అమ్మవారికి బోనాలు మోసుకెళ్తున్న భక్తులు

యాడికి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం పెద్దమ్మతల్లికి, రాయలచెరువులో రేణుకాయల్లమ్మకు భక్తులు బోనాలు సమర్పించారు. ఈ ఏడాది వర్షాలు పడక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అమ్మవారు కరుణించి వర్షాలు కురిసేలా చేయాలని బోనాలు సమర్పించినట్లు భక్తులు తెలిపారు. రాయలచెరువులో అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

30 ఏళ్ల తరువాత మొహర్రం



పోలీసుల బందోబస్తు నడుమ జలధికి తరలుతున్న పీర్లు

పెద్దవడుగూరు, జూలై13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమ్మగుడి గ్రామంలో 30 ఏళ్ల తరువాత మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఆదివారం పండుగ ప్రశాంతంగా ముగిసింది. 1996ఏడాదిలో మొహర్రం సందర్భంగా జరిగిన ఘర్షణల్లో పోలీసు కాల్పుల్లో ఒకరు మృతిచెందడంతో అప్పటి నుంచి మొహర్రం వేడుకలు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డిని గ్రామపెద్దలు ఆశ్రయించగా ఆయన ఆదేశాల మేరకు సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ ఆంజనేయులు గ్రామంలో ప్రజలను, పెద్దలను సమావేశపరిచి మొహర్రం పండుగకు సహకరించాలని సూచించారు. గ్రామస్థుల సహకారంతో పండుగ ప్రశాంతంగా ముగిసింది.

పుట్లూరు: మండలంలోని తక్కళ్లపల్లి, కోమటికుంట్ల తదితర గ్రామాల్లో ఆదివారం మొహర్రం వేడుకలు ముగిశాయి. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రామంలో డప్పువాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పీర్లు జలధికి తరలివెళ్లాయి. భక్తులు భారీగా తరలివచ్చారు.

శెట్టూరు: మండల పరిధిలోని చిన్నంపల్లి గ్రామంలో ఆదివారం మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి జలధి కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున పీర్లను దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న కుడుములాట



గ్రామ వీధిలో కుడుములాట ఆడుతున్న అర్చకులు

విడపనకల్లు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు గ్రామంలో నాలుగు రోజులుగా సాగుతున్న భీమలింగేశ్వర స్వామి రథోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం కుడుములాట నిర్వహించారు. ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి స్వామికి ప్రీతిపాత్రమైన మద్యాన్ని, మాంసాన్ని నైవేద్యంగా పెట్టి పూజలు చేశారు. భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామి వారి సన్నిధి నుంచి గ్రామ వీధుల్లో ఆలయ అర్చకులు కుడుములాట ఆడారు. అనంతరం గరుడోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే చిన్నప్పరెడ్డి జయంతి




చిన్నప్పరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే చిన్నప్పరెడ్డి జయంతి వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక చిక్కణ్ణేశ్వర ఆలయం వద్ద ఉన్న చిన్నప్పరెడ్డి విగ్రహానికి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పలువురు పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. కణేకల్లు ప్రాంతానికి హెచ్చెల్సీ కాలువను తీసుకురావడంలో చిన్నప్పరెడ్డి పాత్ర ప్రముఖమైనదని వక్తలు కొనియాడారు. రాయదుర్గం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పనిచేసి చిన్నప్పరెడ్డి అందరి మనస్సుల్లో గుర్తుండిపోయారన్నారు. ఆనంద్‌రాజ్, చంద్రశేఖర్‌గుప్తా, బీటీ రమేష్, చాంద్‌బాషా, నాగభూషణం, నాగప్ప, గోపాల్, వేణు, వెంకటేశులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

బ్రహ్మసముద్రం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కంబదూరు వెంకటేశులు వ్యవసాయ తోటలో పనిచేస్తున్న రామాంజనేయులు(50) పాము కాటుతో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వ్యవసాయ తోటలో నిద్రిస్తున్న రామాంజనేయులు అర్ధరాత్రి సమయంలో కుడిచేతికి పాము కాటు వేసింది. గమనించిన ఆయన తోటి వారికి తెలిపారు. చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ నరేంద్ర కుమార్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రెచ్చిపోతున్న పెట్రోల్ దొంగలు



ద్విచక్రవాహనం నుంచి పెట్రోల్ తీస్తున్న దొంగ

గుంతకల్లుటౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాత్రి వేళల్లో ఇళ్ల ముందర నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాల్లో పెట్రోల్ దొంగతనాలు అధికమయ్యాయి. పలు కాలనీల్లో ఇళ్ల ముందర ఉంచిన ద్విచక్రవాహనాల పెట్రోల్‌ను దొంగలు బాటిళ్లలో ఎత్తుకెళుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున తిలక్‌నగర్‌లోని మదీన మసీద్ రోడ్డులో ఓ ఇంటి వద్ద ఉంచిన ద్విచక్రవాహనం నుంచి పెట్రోల్‌ను బాటిల్‌లో ఓ వ్యక్తి నింపుకున్నాడు. తరువాత పెట్రోల్ పైపును కోశాడు. దీంతో పెట్రోల్ అంతా కాలువలోకి వెళ్లిపోయింది. ఈ దృశ్యాలు అక్కడ ఓ ఇంటికి ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఈ ప్రాంతంలో రాత్రి 12గంటలైనా యువకులు కాలనీలో తిరుగుతున్నారని మహిళలు వాపోతున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ఉధృతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కంప్యూటర్ కోర్సులు కనుమరుగు..!

● వైసీపీ పాలనలో మూలనపడ్డ కంప్యూటర్లు

● పునఃప్రారంభించాలంటున్న విద్యార్థులు



పాఠశాలలో మూలనపడేసిన కంప్యూటర్లు

కణేకల్లు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉన్నత పాఠశాలలో ఒకప్పుడు విద్యార్థులకు అందిస్తున్న కంప్యూటర్ కోర్సులు నేడు కనుమరుగయ్యాయి. విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు సాంకేతిక విద్యను అందించాలనే సదుద్దేశంతో కంప్యూటర్ కోర్సులను ప్రవేశపెట్టారు. ఇందుకు ఒక ఇన్‌స్ట్రక్టర్‌ను కూడా ఏర్పాటు చేశారు. కానీ గత వైసీపీ పాలన నుంచి అవి కనుమరుగయ్యాయి. ప్రస్తుతం విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. కంప్యూటర్ కోర్సులను తిరిగి ప్రారంభించాలని కోరుతున్నారు.

వైసీపీ పాలనకు ముందు అన్ని పాఠశాలల్లో అమలు

మండల వ్యాప్తంగా 13 ఉన్నత పాఠశాలల్లో 2014కు పూర్వం ఒక్కో పాఠశాలలో 10 నుంచి 15 దాకా కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఇన్‌స్ట్రక్టర్‌ను కూడా నియమించారు. ప్రతి రోజూ 6 నుంచి 10వ తరగతి వరకు ఒక గంట పాటు తరగతుల వారిగా శిక్షణ ఇచ్చేవారు. కానీ వైసీపీ పాలన ప్రారంభమైన కొద్దిరోజులకే కంప్యూటర్ కోర్సులను నిలిపివేయడంతో కంప్యూటర్లన్నీ అటకెక్కాయి.

పునఃప్రారంభించాలి..

నేటి ఆధునిక, సాంకేతిక యుగంలో కంప్యూటర్ కోర్సుల ప్రాధాన్యం ఎంతో ఉండడంతో పాఠశాలల్లో వాటిని పునఃప్రారంభించాలని విద్యార్థులు కోరుతున్నారు. బహిరంగ మార్కెట్‌లలో కంప్యూటర్ కోర్సులను నేర్చుకోవాలంటే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయి. తద్వారా సాంకేతిక విద్య ద్వారా అన్ని రంగాలలో అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. ప్రధానంగా సీఎం చంద్రబాబునాయుడు కంప్యూటర్ కోర్సులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచే వ్యక్తిగా ఉండడంతో పాఠశాలల్లో కోర్సులను పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటారని విద్యార్థులు ఆశిస్తున్నారు.

కంప్యూటర్ కోర్సులంటే ఆసక్తి: కవిత, కణేకల్లు



కంప్యూటర్ కోర్సులంటే ఎంతో ఆసక్తి. దానిని నేర్చుకుని సాంకేతికత పట్ల అవగాహన పొందాలనుకుంటున్నాం. కానీ పాఠశాలల్లో కంప్యూటర్ కోర్సులు లేకపోవడంతో ఆవేదన చెందుతున్నాం.

పునఃప్రారంభిస్తే బాగుంటుంది: సంజన, కణేకల్లు



ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ కోర్సులను పునః ప్రారంభించాలి. కొన్ని పాఠశాలల్లో కంప్యూటర్లను తీసేసి ఒక చోట సర్ది పెట్టారు. ప్రత్యేకంగా కోర్సుల బోధనకు ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

చదువుకుంటేనే ఉన్నతస్థాయిలో ఉంటాం

● ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



మహిళలతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కష్టపడి బాగా చదివితేనే ఉన్నతస్థాయిలో ఎదిగేందుకు అవకాశం ఉంటుంది. బాగా చదివి విజయాలు సాధించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ఆదివారం మండలంలోని తూర్పుకోడిపల్లిలో సుపరిపాలనకు తొలిఅడుగులో భాగంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని చేపట్టారు. ఇటీవల ఇదే గ్రామానికి చెందిన చౌడప్ప రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్య చికిత్సలు తీసుకుంటున్నారు. ఇతనికి ఎమ్మెల్యే రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. అదేవిధంగా ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న డయాలసిస్ వ్యాధిగ్రస్థుడు మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయాన్ని ఇచ్చారు. విద్యార్థి ఎస్.వనితకు కళాశాల్లో చదువుకునేందుకు రూ.25 వేలు ఆర్థికసాయాన్ని అందచేశారు. అలాగే తల్లిదండ్రులు మృతి చెందడంతో అనాథలుగా మారిన అభి, రేవంత్ అనే చిన్నారులకు పాఠశాలతో పాటు హాస్టల్ వసతి కల్పించాలని అక్కడే ఉన్న అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సమస్యలను తెలుసుకునేందుకు తానే స్వయంగా ఇంటింటికి వెళుతున్నానన్నారు.

బీర పంట నేలమట్టం



వర్షానికి నేలకొరిగిన బీరపంట

కళ్యాణదుర్గంరూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రంపల్లిలో ఆది వారం కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి బీరపంట నేలమట్టమైంది. రైతు మారుతి తెలిపిన మేరకు.. తనకున్న పది ఎకరాల పొలంలో రెండు ఎకరాలలో దాదాపు రూ. 3 లక్షలు పెట్టుబడితో బీర పంట సాగు చేశాడు. మూడు రోజుల క్రితం మొదటి కోత కోశారు. ఇంతలోనే వర్షం రూపంలో బీరపంట మొత్తం నేలమట్టం కావడంతో దాదాపు రూ.3 లక్షలు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

గుంతకల్లుటౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ పురపాలక బాలుర ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. 25ఏళ్ల తరువాత విద్యార్థులు ఒకేచోట కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన విద్యార్థులంతా ఒకేచోట కలుసుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, విశ్రాంత హెచ్ఎంలు చంద్రశేఖర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, నారాయణస్వామి, సూర్యం, విశ్రాంత ఉపాధ్యాయలు మస్తానప్ప, వీరభద్రగౌడ్, రామాంజనేయులు, పీడీ నాగరాజును పూర్వవిద్యార్థులు సన్మానించారు. పూర్వవిద్యార్థులు తిమ్మప్ప, వనూరప్ప, అశోక్, క్రాంతి పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ

ఉరవకొండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా బి. లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. స్థానిక క్లబ్ భవనంలో ఆదివారం నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యదర్శిగా వేదమూర్తి, కోశాధికారిగా హర్షవర్ధన్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ గవర్నర్ విరుపాక్షిరెడ్డి హాజరయ్యారు. క్లబ్ సభ్యులు జయకృష్ణ, సత్యన్న, నాగభూషణం, బాలచంద్ర, నూర్‌మహ్మద్, నాగేశ్వరరావు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

సెకీ ఒప్పందాలను రద్దు చేయాలి

గుంతకల్లుటౌన్, జూలై13(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలు, సెకీ ఒప్పందాలను ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజల వ్యతిరేకతను క్యూఆర్ కోడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి, విద్యుత్ చార్జీలను పెంచమని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, నాయకులు జగ్గలి రమేష్, షాషా, రామునాయక్, జాకీర్, సూరి పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

పెద్దవడుగూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): నార్త్‌కెనాల్ డిస్ట్రిబ్యూటర్ ప్రధాన కాలువలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన పిచ్చిమొక్కలను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తన సొంత నిధులతో యాంత్రిక పనిముట్ల సాయంతో తొలగించే కార్యక్రమం చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో సాగునీరు సమృద్ధిగా ఉన్నా, కాలువలో ఉన్న పిచ్చి మొక్కలతో నీటి ప్రవాహానికి అడ్డుపడి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. మండలంలో పర్యటించినపుడు సాగునీటికోసం రైతులు పడుతున్న అవస్థలను చూసి నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటానని రైతులకు భరోసా ఇచ్చారు.

ఆర్థికసాయం

తాడిపత్రి, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుంకులమ్మపాలెంకు చెందిన సచివాలయ ఉద్యోగి మల్లికార్జున క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండడంతో వైద్యఖర్చుల నిమిత్తం ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.15వేలు అందజేసినట్లు అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. హైదరాబాద్‌లో చికిత్స తీసుకుంటున్న మల్లికార్జున ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడని తెలుసుకొని సంస్థ తరపున సాయం అందించినట్లు తెలిపారు. సభ్యులు రామేశ్వర్‌రెడ్డి, శంకర్, శ్రీహరి, శ్రీరంగయ్య, కరుణాకర్, కుమారస్వామి పాల్గొన్నారు.

టీడీపీ మండల కన్వీనర్ పదవికి తీవ్రపోటీ..!

యాడికి, జూలై 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ యాడికి మండల కన్వీనర్ పదవికోసం ఆశావహుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. వివిధ సామాజిక వర్గాల నుంచి ఆరుగురు కన్వీనర్ పదవి ఆశిస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో యాడికి మండలం కీలకంగా ఉంది. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 46,298 మంది ఓటర్లు ఉన్నారు. 12గ్రామ పంచాయతీల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పనిచేస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలు అయిన యాడికి, రాయలచెరువులో నాయకుల మధ్య విభేదాలు బాహాటంగానే కనిపిస్తున్నాయి. ఈ రెండు పంచాయతీల్లో కార్యకర్తల కన్నా నాయకులుగా చలామణి అయ్యేవారే ఎక్కువమంది ఉన్నారని, వీరు ప్రజల్లో మమేకం అయ్యేది చాలా తక్కువేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వీరంతా ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి గ్రామాల పర్యటనకు వచ్చినపుడు మాత్రం హడావుడి చేస్తుంటారనే విమర్శలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండల కన్వీనర్ పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిని నియమించాలని తెలుగుదేశం కార్యకర్తలు కోరుతున్నారు. ప్రస్తుతం టీడీపీ మండల కన్వీనర్‌గా కమ్మ సామాజిక వర్గానికి చెందిన రుద్రమనాయుడు పనిచేస్తున్నారు. కన్వీనర్ పదవి కోసం పరిమి చరణ్, రవికుమార్‌రెడ్డి, త్రినాథ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, తిరంపురం నీలకంఠ రేసులో ఉన్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ కార్మికులు

రాయదుర్గంరూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేపడతామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున హెచ్చరించారు. ఆదివారం సమ్మె మొదటి రోజున పాత మున్సిపల్ కార్యాలయం వద్ద శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా 13 వేల మందికిపైగా ఉన్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉందన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు ఇస్తున్న జీతం రూ.13 వేలతో కుటుంబాలు ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. కార్మికుల శ్రమను ఇప్పటికైనా గుర్తించి ప్రభుత్వం తక్షణమే జీఓ నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దు చేయాలన్న నిర్ణయం ఉపసంహరించి కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, లేని పక్షంలో 16న చలో విజయవాడ చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తిప్పేరుద్ర, నాయకులు నరసింహులు, బసప్ప, ఇస్మాయిల్, రాము, శివమ్మ, రహంతుల్లా పాల్గొన్నారు.

తాడిపత్రి: మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో జీవో 36 సాధనకు నిరసన చేపట్టారు. పట్టణంలోని పాతమున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్ పారిశుధ్య కార్మికులు ఆదివారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. నిరసనకు సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్, నాగేంద్ర, శ్రీరాములు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి, రామాంజనేయులు, ఉమాగౌడ్, శ్రీరాములు, బాషా పాల్గొన్నారు.



తాడిపత్రిలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలకు న్యాయం

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

పుట్లూరు: కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరిస్తూ కరపత్రాలను ఇంటింటికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామన్నారు. అనంతరం ఎస్సీ కాలనీలో రైతు రూ.2.30లక్షలతో నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. తాడిపత్రి నుంచి బాలాపురం మీదుగా మడ్డిపల్లి వరకు పాఠశాల విద్యార్థుల సౌకర్యం కోసం బస్సు సర్వీసును ప్రారంభించాలని ఓబులనాయుడు ఎమ్మెల్యేకు విన్నవించారు. మండలంలో ఇప్పటికే మారుమూల గ్రామాలకు సర్వీసులు పునఃప్రారంభించామని, ఇది కూడా ఏర్పాటుచేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బాలరంగయ్య, సుదర్శన్‌నాయుడు, కులశేఖర్‌రెడ్డి, జీసీబాబు, భాస్కర్‌నాయుడు, గోవర్ధన్‌రాజు, రంగయ్య, గిరిరెడ్డి పాల్గొన్నారు.

కణేకల్లు: ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాల గురించి స్థానిక టీడీపీ నాయకులు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు వార్డులలో పర్యటించి పథకాలు గురించి వివరించారు. ఆనంద్‌రాజ్, చంద్రశేఖర్‌గుప్తా, బీటీ రమేష్, చాంద్‌బాషా, వార్డు మెంబర్ నాగభూషణం, గోపాల్, వేణు, శేఖర్, గామేష్ పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు.ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో ఎమ్మెల్యే పర్యటన



వ్యక్తితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్ అందుతుందా అని ఆరాతీశారు. తల్లికి వందనంలో అర్హులైన వారికి ఏదైనా ఇబ్బంది కలిగి ఉంటే వెంటనే సంప్రదించాలని సూచించారు. తాగునీరు, డ్రైనేజీ సమస్య ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట ఎస్వీ రవీంద్రారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఖాదర్, బాషా, లోకనాథ్‌రెడ్డి ఉన్నారు.

'పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి అడుగు పెట్టనివ్వం'



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

తాడిపత్రి, జూలై 13(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు రీకాల్ ప్రోగ్రాంకు ఎవరైనా రావొచ్చు కానీ కేతిరెడ్డి కుటుంబం మాత్రం రాకూడదని, వస్తే వెనక్కి పంపిస్తామంటూ వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై విరుచుకుపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం వారు మాట్లాడుతూ గత ఐదేళ్లు చేసిన అరాచకాలు అన్ని ఇన్నీ కావని, నీ పాపాలే ఈరోజు తాడిపత్రిలోకి అడుగుపెట్టనీయకుండా చేస్తున్నాయన్నారు. మహిళా కౌన్సిలర్లు అని కూడా ఆలోచించకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నువ్వు నీ కొడుకు కలిసి డీఎస్పీతో నమోదుచేశావన్నారు. గత ఐదేళ్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్వీ రవీంద్రారెడ్డి అలియాస్ పొట్టి రవిపై అనేక కేసులు బనాయించి ఊరిలోకి అడుగుపెట్టనీయలేదని మరిచిపోయావా మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నీ మీద ఎంతో నమ్మకం, గౌరవం ఉందన్నారు. రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు ఎవరైనా తాడిపత్రిలోకి అడుగు పెట్టవచ్చు కానీ కేతిరెడ్డి పెద్దారెడ్డి కుటుంబం మాత్రం రాకూడదని హెచ్చరించారు. వైస్‌చైర్మన్ అరుణ, కౌన్సిలర్లు రేష్మాపర్వీన్, జింకా లక్ష్మీదేవి, రమాదేవి పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

విడపనకల్లు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి వర్గీయులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సుశీల నేత్రాలయ సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ కర్నూల్ వైద్యుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పాల్తూరు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చురుగ్గా తూము నిర్మాణ పనులు

వజ్రకరూరు(ఉరవకొండ), జూలై 13(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండల ప్యాపిలి సమీపంలో జరుట్ల రాంపురం చెరువుకు నీరందించే తూము పనులు చురుగ్గా సాగుతున్నాయి. 171 కి.మీ వద్ద హంద్రీనీవా ప్రధానకాలువ నుంచి తూముకు నీటిని అందించేందుకు పనులు చకచక సాగుతున్నాయి. ఈ నిర్మాణం పూర్తయితే తాగునీటితో పాటు భూగర్భజలాలు కూడా పెరుగుతాయి. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవతో ఈ నిర్మాణం పనులు చేపట్టారు. మరో నాలుగు రోజుల్లో పనులు పూర్తి అవుతాయని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు తెలిపారు.

కాజ్‌వేకు మరమ్మతులు



కాజ్‌వేకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

విడపనకల్లు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకలగురికి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న కాజ్‌వేను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. దీంతో ఆ గ్రామానికి శనివారం రాకపోకలు బంద్ అయ్యాయి. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు మంత్రి పయ్యావుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వెంటనే కాజ్‌వే పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. మండల అధికారులు చీకలగురికి గ్రామం చేరుకుని సర్పంచ్ కొత్తపల్లి పద్మావతి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులు, నాగేశ్వరరావు కాజ్‌వే పనులను చేయించారు. శనివారం సాయంత్రానికి పనులు పూర్తి చేయించి గ్రామానికి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.



పనులు పూర్తయ్యాక..